సాక్షి ఆదిలాబాద్

మంగళవారం | 3 | డిసెంబర్ | 2024

నేడు దివ్యాంగుల దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సబిత ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో అన్ని కేటగిరీల దివ్యాంగ అసోసియేషన్ సభ్యులు, దివ్యాంగ స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐఏఎల్ రాష్ట్ర కమిటీలో జిల్లా అడ్వకేట్‌కు చోటు

ఆదిలాబాద్‌టౌన్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర మహాసభలు రెండు రోజులుగా వరంగల్‌లో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర కమిటీని ఎన్నుకోగా, జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది మహ్మద్ అబ్దుల్ రహీంకు అందులో సభ్యుడిగా చోటు దక్కింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/21.0

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ గౌస్ ఆలం



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: క్రమశిక్షణ, అంకితభావంతో పోలీసులు విధులు నిర్వహించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకొని జిల్లాకు కేటాయించిన 200 మంది సివిల్, ఏఆర్ నూతన కానిస్టేబుళ్లతో సోమవారం పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. పోలీసు వ్యవస్థ సమాజంలో బాధ్యతాయుతమైందన్నారు. సివిల్‌కు సంబంధించి 94 మంది పురుష కానిస్టేబుళ్లు, 46 మంది మహిళా కానిస్టేబుళ్లను జిల్లాలోని ఆయా స్టేషన్లకు కేటాయించినట్లు పేర్కొన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, ప్రకాశ్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

5న జాబ్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సాత్నాల క్వార్టర్‌లో ఉదయం 11 గంటలకు మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదర్శ ఆటోవరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ 4 పోస్టులు, సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్ ఒక పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. డిగ్రీ పాసై, 20 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 8121009065, 9494305417 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హాకీ విజేతలకు సన్మానం



క్రీడాకారులను సన్మానించి కప్ అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలిచి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. అలాగే ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లోనూ బాలుర హాకీ జట్టు రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. ఈపోటీల్లో రాణించిన క్రీడాకారులను కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సోమవారం ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలోనూ రాణించాలని క్రీడాకారులకు సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడలఅధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, ఏటీడీవో అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్: తమకు న్యాయం చేయాలంటూ 317 జీవో బాధిత ఉపాధ్యాయులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 317 జీవో కారణంగా చాలామంది ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికత కోల్పోయిన వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ, అసెంబ్లీలో ఈ అంశంపై తప్పకుండా మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఇందులో ఉపాధ్యాయులు నవీన్, సఫల్, నాగరాజ్, తిరుమల, శుభాంగి, శ్రవణ్, వివేక్, దయాకర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లోని కౌంటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు (ఫైల్)



ఏడాది గడిచే..

- గత డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- జిల్లాలో మూడు ప్రధాన పార్టీలకు దక్కిన ప్రాతినిధ్యం
- అధికార కాంగ్రెస్‌కు మాత్రం పూర్తిస్థాయిలో చిక్కని పట్టు
- పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి
- పార్టీ పటిష్టతకు 'హస్తం' యత్నాలు
- 'స్థానిక'లో సత్తా చాటేందుకు ప్రణాళికలు

సాక్షి,ఆదిలాబాద్: గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సరిగ్గా ఏడాది క్రితం డిసెంబర్ 3న వెలువడ్డాయి. అప్పటివరకు బీఆర్‌ఎస్‌కు ఆయువుపట్టుగా ఉన్న ఈ జిల్లాలో అనూహ్య రిజల్ట్స్ రావడం తెలిసిందే. ఆదిలాబాద్ స్థానంలో బీజేపీ బోణీ కొట్టగా, బోథ్, ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ పట్టు నిలుపుకుంది. ఖానాపూర్‌లో కాంగ్రెస్ గెలుపొందింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ జిల్లాలో మాత్రం ఆ పార్టీకి సరైన ప్రాతినిధ్యం దక్కలేదు. తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లోనూ హస్తవాసి కలిసి రాలేదు. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అధికార పార్టీ ప్రణాళికలు రూపొందిస్తుంది. అవి ఎంతవరకు సఫలీకృతం అవుతాయో వేచి చూడాల్సిందే.

వారు పోయి.. వీరు వచ్చే

ఆదిలాబాద్‌లో బీఆర్‌ఎస్ నుంచి జోగు రామన్న ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండగా, గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ ఆయనపై గెలుపొందారు. బోథ్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న రాథోడ్ బాపూరావుకు టికెట్ దక్కకపోగా, ఆ స్థానంలో టికెట్ పొందిన అనిల్ జాదవ్ గెలుపొందారు. ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రేఖానాయక్ కాంగ్రెస్ పార్టీకి మారడంతో ఆ స్థానంలో భూక్యా జాన్సన్ నాయక్‌కు టికెట్ దక్కగా, కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ ఆయనపై గెలుపొందారు. ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కాదని పార్టీ కోవ లక్ష్మికి టికెట్ ఇవ్వగా, ఆమె కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యామ్ నాయక్‌పై గెలుపొందారు. ఈ విధంగా జిల్లా రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. అంతేకాకుండా అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్‌ని వీడిన ముఖ్యనేతలు అధికార పార్టీలో చేరడం గమనార్హం.

అభివృద్ధికి విఘాతం..

ప్రతిపక్ష పార్టీలు జిల్లాలోని నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తుండడంతో అభివృద్ధికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నట్లు ఈ ప్రాంత ఎమ్మెల్యేలు అధికార పార్టీపై ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పోల్చితే ఈ నియోజకవర్గాలకు నిధుల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉందన్న విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య అభివృద్ధి విషయంలో వాదోపవాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పదవుల పరంగా నిరాశే..

ఈఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు నామినేటెడ్ పదవుల విషయంలో అనేక ఆశలు పెట్టుకున్నారు. అయితే రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవుల విషయంలో జిల్లా ముఖ్య నాయకులెవరికి అవకాశం దక్కలేదు. ఇక జిల్లాస్థాయిలో గ్రంథాలయ చైర్మన్, ఐసీడీఎస్ కోఆర్డినేటర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు, ఇతరత్రా భర్తీకి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో వీటిపై ఆశ పెట్టుకున్న పలువురికి నిరాశే ఎదురవుతుంది. అంతేకాకుండా పార్టీకి దిక్సూచిలా ఉండాల్సిన డీసీసీ అధ్యక్ష పదవి అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు నుంచి ఖాళీగా ఉంది. జిల్లాలో ప్రతికూల ఫలితాల తర్వాత కూడా పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యల విషయంలో ఇప్పటికీ తాత్సారమే కనిపిస్తుంది. పార్టీ అధికారంలోకి వచ్చిందనే సంబరం తప్పితే కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పూర్తిస్థాయిలో లేదనే చెప్పవచ్చు.

'మధ్యాహ్నం'పై ఫోకస్



ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో ప్రణీత (ఫైల్)

- పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు
- తనిఖీలతో పెరగనున్న నాణ్యత
- కొన్నిచోట్ల ఇంకా మారని తీరు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలో తరచూ ఫుడ్‌పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటుండగా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన ఆశ్రమాలు, కేజీబీవీలు, గురుకులాలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న భోజనాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలు వేసింది. జిల్లా స్థాయి అధికారులను టీమ్ లీడర్లుగా నిర్ణయించి ఆయా శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో ఇప్పటికే ఆయా పాఠశాలలు, వసతిగృహాల్లో తనిఖీలు ప్రారంభమయ్యాయి.

కమిటీలు, పర్యవేక్షణ ఇలా..

మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పర్యవేక్షించేందుకు కలెక్టర్ ప్రత్యేక కమిటీలు వేశారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ అధికారులు, జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు. మధ్యాహ్న భోజనంపై అలసత్వం వహిస్తే సంబంధిత ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, జిల్లాస్థాయి ఆహార భద్రత కమిటీలో రెండు బృందాలను నియమించారు. మొదటి బృందంలో ఐటీడీఏ పీవో, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) లీడర్లుగా, సభ్యులుగా ఉట్నూర్ అడిషనల్ డీఎంహెచ్‌వో, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, డీఎస్వో, ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్, గురుకులాల ఆర్సీవో, డీసీవో, గిరిజన సంక్షేమాధికారి, సీడీపీవో, ఏసీడీపీవోలు వ్యవహరించనున్నారు. రెండో టీమ్‌లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లీడర్‌గా, సభ్యులుగా డీఎంహెచ్‌వో, ఫుడ్‌సేఫ్టీ అధికారి, డీఈవో, గురుకులాల ఆర్సీవో, డీసీవో, బీసీ సంక్షేమ అధికారులను నియమించారు.

పెరగనున్న భోజనం నాణ్యత

ప్రత్యేక కమిటీల తనిఖీలతో మధ్యాహ్న భోజనం నాణ్యత పెరిగే అవకాశముంది. ఇప్పటికే జిల్లా, మండల స్థాయి అధికారులు పాఠశాలల్లో తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్నారు. వివరాలు నమోదు చేసి కలెక్టర్, డీఈవో, ఐసీడీఎస్ పీడీ, గిరిజన శాఖ అధికారులకు పంపించారు. వారు నివేదికలు పరిశీలించి సంబంధిత పాఠశాలల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. కాగా, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించినట్లు సమాచారం.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టేలా చర్యలు చేపడుతున్నాం. ఎంఈవోలతో పాటు సెక్టోరియల్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు పాఠశాలలోనే ఉండాలని ఆదేశించాం. ఫుడ్‌పాయిజన్ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.– **ప్రణీత, డీఈవో**

పారామెడికల్ కోర్సు షురూ

- మైత్రి ట్రాన్స్ క్లినిక్ సైతం..
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం



వర్చువల్ విధానంలో పారామెడికల్, మైత్రి క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రిమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పారామెడికల్ కోర్సును, మైత్రి ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహలు సోమవారం హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈసందర్భంగా పలు విషయాలపై సీఎం మాట్లాడారు. కాగా రిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా హాజరయ్యారు. ట్రాన్స్‌జెండర్ కోసం రిమ్స్‌లో ప్రత్యేకంగా మైత్రి క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతి, మెడికల్ సూపరింటెండెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే కుష్ఠు నయం

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: కుష్ఠును ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే వ్యాధి నయం అవుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని అంకోలి పీహెచ్‌సీలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈనెల 15 వరకు నిర్వహించనున్న సర్వేలో ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని అనుమానిత కేసులు గుర్తించి చికిత్స ప్రారంభించేలా చర్యలు చేపడుతారన్నారు. ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే బాధితులు అంగవైకల్యం బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఎలాంటి భయం లేకుండా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, కుష్ఠురహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జాతీయ వాయు కాలుష్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన కరదీపికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఇందులో జిల్లా కుష్ఠు నివారణాధికారి గజానన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, వైద్యులు సాగర్, సర్ఫరాజ్, డీపీఎంవోలు వామన్‌రావు, రమేశ్, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, పర్యవేక్షకులు సుభాష్, సురేష్, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అభ్యాసదీపికలు

కైలాస్‌నగర్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధులయ్యేలా అభ్యాస దీపికలు అందజేస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముద్రించిన లాంగ్వేజ్ అభ్యాస దీపికలను తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు భయపడకుండా పరీక్ష రాసేందుకు ఇవి దోహదపడతాయన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో రూపొందించిన ఈ దీపికల్లో పొందుపరిచిన ముఖ్యాంశాలు, సూచనలు విద్యార్థుల సన్నద్ధతకు మార్గనిర్దేశనం చేస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి వీటిని అందించనున్నట్లు తెలిపారు. వీటి రూపకల్పనకు కృషి చేసిన జిల్లా ఉమ్మడి పరీక్షల సంస్థ, పాల్గొన్న విషయ నిపుణులను అభినందించారు. ఇందులో డీఈవో ప్రణీత, డీసీఈబీ సెక్రెటరీ గజేందర్, అసిస్టెంట్ సెక్రెటరీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: ఆర్టీసీ హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నంబర్ కలిగి ఉన్న వారు అర్హులని తెలిపారు. 30రోజులపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.15,600 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈనెల 15నుంచి శిక్షణకు సంబంధించి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అర్హులైన వారు డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ యూసుఫ్‌ను 9063400628 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- ప్రజావాణికి 70 వినతులు
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ సాధ్యాసాధ్యాల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ వారం మొత్తం 70 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదిన వారి మాటల్లోనే.

కరెంట్ సౌకర్యం కల్పించాలి



మాది జైనథ్ మండలం గిమ్మ గ్రామం. మేమంతా కూలీనాలి చేసుకునే నిరుపేదలం. మా గ్రామంలో ప్రభుత్వం కట్టిన 29 డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివసిస్తున్నాం. అందులో కరెంట్ సౌకర్యం లేక చీకట్లోనే ఉండాల్సి వస్తోంది. రాత్రిపూట పిల్లలు చదువుకోలేని పరిస్థితి ఉంది. వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

మాకు రుణమాఫీ కాలేదు

మేమంతా మావల మండలంలోని వాగాపూర్ గ్రామానికి చెందిన పీవీటీజీ గిరిజన తెగకు చెందిన తోటి కులస్తులం. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. అయితే రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీలో మా రుణాలేమి మాఫీ కాలేదు. రూ.లక్ష లోపు రుణం ఉన్నా లబ్ధి చేకూరలేదు. ఏఈవోను కలిసి అడిగినా ఎలాంటి స్పందన లేదు. రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నాం.




అన్యాయంగా విధుల్లో నుంచి తొలగించారు



నా పేరు జి.చంద్రకళ. నేను బేల కేజీబీవీలో కొన్నేళ్లుగా నైట్ వాచ్ ఉమెన్‌గా పనిచేశా. గత ఏప్రిల్‌లో రెన్యూవల్ చేసిన అధికారులు ఆధార్ ప్రమాణికంగా 61ఏళ్లుగా నిర్ధారించి గత జూన్‌లో నన్ను అన్యాయంగా విధుల నుంచి తొలగించారు. ఓటరు కార్డు గుర్తింపు ద్వారా పరిశీలనకు అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకోకుండా ముందుగానే తొలగించారు. దీనిపై ఎంఈవోకు రాతపూర్వకంగా విన్నవించి నా పట్టించుకోలేదు. నన్ను తిరిగి విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నా.

బకాయిలు చెల్లించాలని ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట 'ఆశా'ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

కైలాస్‌నగర్: కుష్ఠు, పల్స్‌పోలియోకు సంబంధించిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు గతంలో నిర్వహించిన కుష్ఠు సర్వే, పల్స్ పోలియో కార్యక్రమాలకు సంబంధించిన డబ్బులే ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఈనెల 2నుంచి మరోసారి కుష్ఠు సర్వే చేయాలని ఆదేశించడం సరికాదన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైతం శోభ, ఎం.సుజాత, పుష్ప, లక్ష్మి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసుల ధర్నా

జీవోనం. 81 ప్రకారం తమకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తు వీఆర్‌ఏ వారసులు ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో పని చేసిన వీఆర్‌ఏలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిందన్నారు. అలాగే 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు సైతం ఉద్యోగాలు కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. 16 నెలలు గడిచినా ఇప్పటికీ ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో నాయకులు కె.సంతోష్, సల్మాన్, మధుసూదన్, విజయ్‌కుమార్, లస్మన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు

కైలాస్‌నగర్: మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ తిరుపతి ప్రకటనలో తెలిపారు. మహిళా సంఘాలతో జిల్లాకేంద్రంలో అవగాహన ర్యాలీతో పాటు మహిళా శక్తి లబ్ధిదారులకు వివిధ యూనిట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు భద్రత పరికరాల పంపిణీతో పాటు ప్రత్యేక ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అలాగే ఉత్తమ సేవలందించిన కార్మికులకు అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఇచ్చోడ: మండలంలోని జున్ని గ్రామానికి చెందిన డొంగ్రె జ్ఞానేశ్వర్ (45) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జ్ఞానేశ్వర్ గత కొన్ని రోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు వ్యవసాయ పనులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి పొలానికి వెళ్లాడు. సాయంత్రం వరకు కూడా ఇంటికి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకుని కన్పించాడు. మృతుడు అన్న దేవిదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ..


రోషిని (ఫైల్)

మంచిర్యాలక్రైం: కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఏసీసీ క్రిష్ణకాలనీకి చెందిన అయిండ్ల శ్రీనివాస్ –హేమలత దంపతుల కుమార్తె రోషిని(22)కి బెల్లంపల్లి బూడిదబస్తీకి చెందిన ప్రేమ్‌కుమార్‌తో గత ఆగస్టులో వివాహం జరిగింది. ఆరోగ్యం బాగా లేదని గత నెల 27న భర్తతో కలిసి రోషిని పుట్టింటికి వచ్చింది. ఆదివారం ఇంట్లో అందరితో సరదాగా గడిపిన రోషిని సోమవారం తెల్లవారుజామున బిల్డింగ్ పైకి వెళ్తుండగా రెండో అంతస్తులో నివాసం ఉంటున్న ధర్మాజి రోషినిని పైకి ఎందుకు వెళ్తున్నావని ప్రశ్నించాడు. వాకింగ్ చేసేందుకు వెళ్తున్నాని చెప్పిన రోషిని కొద్ది సేపటికే కిందకు దూకింది. పెద్ద శబ్దం రావడంతో కిందకు చూసిన ధర్మాజి వెంటనే రోషిని తండ్రికి సమాచారం అందించాడు. తీవ్ర రక్తపు మడుగులో ఉన్న రోషినిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని ఓల్డ్‌కాలనీకి చెందిన భీమనాథం జీవన్ (32) అనే ఫొటోగ్రాఫర్ మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో వడ్ల లోడుతో వెళ్తున్న ఐచర్ వ్యాన్ మోటారు సైకిల్‌ను ఓవర్ టేక్ చేయబోయి ఢీకొట్టింది. దీంతో మోటారు సైకిల్‌తో పాటు జీవన్ కిందపడిపోయి తీవ్ర రక్త స్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. మృతుడి తమ్ముడు సాయిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పేర్కొన్నారు.

వైకల్యం కారాదు శాపం..!



వైకల్యాన్ని లెక్కచేయకుండా ఎన్నో గడ్డు పరిస్థితులను ఎదుర్కొని అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్న వారు ఎందరో ఉన్నారు. వైకల్యాన్ని శాపంగా పరిగణించకుండా ఆత్మవిశ్వాసంతో జయించి ఎందరో దివ్యాంగులు విజయతీరాలకు చేరుకున్నారు. నేటి సమాజంలో వైకల్యం ఉందని అధైర్య పడకుండా ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలి. ఆత్మస్థైర్యం పెంపొందించుకుని అడుగులు వేస్తే అన్ని రంగాల్లో విజయం సాధించడం కష్టమేమి కాదు. దివ్యాంగులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వాలు కూడా అనేక పథకాలను తీసుకొచ్చాయి. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

–మంచిర్యాలటౌన్

- ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి
- అందుబాటులో ఎన్నో ప్రభుత్వ పథకాలు
- సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలకు
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

జిల్లాల వారీగా పెన్షన్ పొందుతున్న దివ్యాంగులు..

మంచిర్యాల	12,677 మంది
ఆదిలాబాద్	6945
నిర్మల్	9626
కుమురంభీం	5858

పింఛన్లు..
దివ్యాంగులకు ప్రభుత్వం నెలకు రూ.4016లు పింఛన్ అందిస్తోంది. ప్రభుత్వ పింఛన్ కోసం ముందుగా వైకల్య నిర్ధారణకు సదరం శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వారు ఇచ్చే సదరం ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు తీసుకుని మున్సిపాలిటీ అయితే మున్సిపల్ కమిషనర్, గ్రామాలకు చెందిన వారైతే ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.

స్వయం ఉపాధి పథకం
దివ్యాంగులు స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా రుణ సదుపాయం కల్పిస్తోంది. 21 నుంచి 55 ఏళ్ల వయస్సు గల అన్ని విభాగాల దివ్యాంగులు బ్యాంకు ద్వారా రూ.లక్షలోపు రుణం తీసుకుంటే 80 శాతం సబ్సిడీ, రూ. 2 లక్షల వరకు అయితే 70 శాతం సబ్సిడీ, రూ. 5 లక్షలలోపు తీసుకుంటే 60 శాతం సబ్సిడీ, రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు గల రుణంపై రూ. 2.01 లక్షల సబ్సిడీ ఇస్తున్నారు.

ప్రయాణం రాయితీ
దివ్యాంగులకు బస్సు, రైళ్లలో రాయితీపై ప్రయాణం చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో శారీరక వైకల్యం గల వారికి 50 శాతం రాయితీ, అంధులకు/మానసిక దివ్యాంగులకు వంద శాతం రాయితీ, వారితో పాటు వెళ్లే ఒక్కరికి 50 శాతం రాయితీ కల్పిస్తున్నారు. రైలు ప్రయాణ ఖర్చుల్లో వారితో పాటు తోడుగా వెళ్లే వారికి 50 శాతం రాయితీ అందిస్తున్నారు. వైకల్యం ఉన్నట్లు మెడికల్ బోర్డు, సదరం వైద్య శిబిరం ద్వారా మంజూరు చేసిన వైకల్య ధృవీకరణ పత్రం, వైకల్యం కనిపించేలా మూడు ఫొటోలతో సమీప ఆర్టీసీ డిపో మేనేజర్లను సంప్రదిస్తే, వారు బస్‌పాస్ మంజూరు చేస్తారు. రైల్వే పాస్‌ను మెడికల్ బోర్డు వారు అందిస్తారు.

దీంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాల్లోనూ 5 శాతం తప్పనిసరిగా దివ్యాంగులకు మంజూరు చేయాల్సి ఉంటుంది.

వివాహ ప్రోత్సాహకాలు
సాధారణ వ్యక్తులు దివ్యాంగురాలు/దివ్యాంగుడిని పెళ్లి చేసుకుంటే ప్రభుత్వం ఆ జంటకు రూ. 1.16 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. సదరం ధృవీకరణ పత్రం, పెళ్లి జరిగినట్లు తీసిన మూడు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా నంబర్ కనిపించేలా పాస్ పుస్తకం మొదటిపేజీ జిరాక్సు, పుట్టినతేదీకి సంబంధించి పదో తరగతి మార్కుల జాబితా, లేకుంటే పంచాయతీ నుంచి జారీ చేసిన ధృవీకరణ పత్రం, తహసీల్దార్ ద్వారా జారీ చేసిన నివాస పత్రం, వధూవరుల రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవాలి.

ఉపకార వేతనాలు
ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతూ, తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామాల్లో రూ. లక్షన్నర, పట్టణాల్లో రూ. 2 లక్షలకు మించని దివ్యాంగులకు ఉపకార వేతనాలను అందజేస్తారు.1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.700, 6 నుంచి 8వ తరగతి వారికి రూ.1000, 9, 10 తరగతుల వారికి రూ.1820 చొప్పున ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలను అందజేస్తోంది. పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు ఇంటర్మీడియెట్ వారికి రూ.1820, డిగ్రీ వారికి రూ. 2,400లు, పీజీ చదివే విద్యార్థులకు రూ. 4,290 చొప్పున ఏడాదికి చెల్లిస్తారు.

ఉపకరణాలు
శారీరక వైకల్యం కలిగిన వారికి మూడు చక్రాల బండి, చంక కర్రలు, క్యాలిపర్స్, మూగ, చెవుడు వైకల్యం కలిగిన వారికి శ్రవణ పరికరాలు, అంధులకు చేతికర్ర, బ్రెయిలీ పలక, ఎంపీ 3 ప్లేయర్, ల్యాప్‌టాప్‌లను ఉచితంగా అందజేస్తారు. సొంత వాహనం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, స్వయం ఉపాధి పొందుతున్న నిరుద్యోగ శారీరక దివ్యాంగులకు పెట్రోలు రాయితీని కూడా కల్పిస్తారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి కుటుంబ ఆదాయం గ్రామాల్లో రూ.లక్షన్నర, పట్టణాల్లో రూ. 2 లక్షలకు మించని వారు, ప్రొఫెషనల్ ఉన్నత విద్యను అభ్యసించే శారీరక వైకల్యం కలిగిన వారికి మూడు చక్రాల వాహనం ఉచితంగా అందిస్తారు.

ధ్రువపత్రం పొందడం ఇలా..
విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు వైకల్య ధృవీ కరణ పత్రం తప్పనిసరి. దీని కోసం నిర్ణీత తేదీల్లో ప్రభుత్వాసుపత్రుల్లో సదరం వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. జిల్లా కేంద్రంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలలో ఒక సారి నిర్వహించే సదరం శిబిరం కోసం స్లాట్‌బుక్ చేసుకోవాలి. వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.

ప్రభుత్వం చేయూతనిస్తుంది



దివ్యాంగులకు ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. జిల్లాలో దాదాపు 19వేల మందికి పైగా దివ్యాంగులు ఉన్నారు. ఇప్పటికే వారికి ప్రభుత్వం నుంచి అందించే పథకాలను సమర్థవంతంగా అందిస్తున్నాం. దివ్యాంగులు సైతం పూర్తి అవగాహన కలిగి ఉంటే, వారికి ఉన్న అవసరాన్ని బట్టి ఉపాధితో పాటు, రుణాలు పొందేందుకు వీలుంటుంది. వారికి అవసరమైన పరికరాలను సైతం ఉచితంగా అందజేస్తాం, వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

– స్వరూపారాణి, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

దివ్యాంగుల శాఖను వేరు చేయాలి



గతంలో దివ్యాంగుల శాఖ ప్రత్యేకంగా ఉండగా, దానిని మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ కిందకు మార్చారు. ప్రత్యేక శాఖ ఉంటేనే దివ్యాంగులకు న్యాయం జరుగుతుంది. మహిళలకు అందిస్తున్నట్లుగానే దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం అందించాలి. రూ.6 వేల పెన్షన్ ఇవ్వడంతో పాటు బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలి. దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కల్పించాలి. దివ్యాంగుల సంఘ భవనం నిర్మించి, ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటిని సకాలంలో అందించేలా చూడాలి.

– బూర్ల మహేందర్, జిల్లా నిరుద్యోగ దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు, మంచిర్యాల

ఇంటి వద్దకే ఈఐఆర్టీలు
విధి వక్రీకరించి శారీరక, మానసిక, అంధ, వినికిడి, మూగ పిల్లలు జన్మిస్తే వారిని చూసి అధైర్య పడకుండా ఈఐఆర్టీలను సంప్రదిస్తే మేమున్నామంటూ ముందుకొస్తారు. పుట్టుకతోనే వినికిడి, మూగ, బుద్ధిమాంద్యత, అంగవైకల్యంతో జన్మించిన పిల్లలకు మిగిలిన విద్యార్థుల్లా మానసిక ధైర్యం అందించి వారికి అవసరమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం వీరిని నియమించింది.

ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీ


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సింగరేణి గ్రీన్‌పార్క్ సమీపంలో గల ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కెట్ నుంచి పాత బస్టాండ్ వైపు బైక్‌పై వెళ్తున్న భరత్, పాత బస్టాండ్ నుంచి మార్కెట్ వైపు స్కూటీపై వస్తున్న అక్షయ్ ఎదురెదురుగా ఢీ కొన్నారు. దీంతో యువకులు కిందపడిపోగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోప్రమాదంలో ఆర్టీసీ బస్సును బైక్ ఢీ కొనగా వాసు అనే యువకునికి తీవ్రగాయాలు కాగా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న స్వదేశ్, కుటుంబ సభ్యులు

నిర్మల్‌టౌన్: పొట్టకూటి కోసం గల్ఫ్ వెళ్లిన వ్యక్తిని స్వదేశానికి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రవాస మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర నాయకులు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. ఖానాపూర్ మండలం గోడలపంపు గ్రామానికి చెందిన రాజేశ్వర్ గత 6 సంవత్సరాల క్రితం కూలీపని నిమిత్తం సౌదీఆరేబియా వెళ్లాడన్నారు. అయితే గత మూడేళ్లుగా అతని నుంచి ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అతని ఆచూకీ తెలుసుకొని స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులు భార్య లక్ష్మి, కుమారులు సిద్దార్థ, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం


దగ్ధమైన దుకాణం వద్ద బాధితుడు

ఖానాపూర్: పట్టణంలోని జీపుఅడ్డాలో గల కేసరి ఫ్యాషన్ రెడిమేడ్ బట్టల దుకాణంలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. రాత్రి 10 గంటల తర్వాత షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుందని దుకాణం యజమాని సుతారి రాజేందర్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో ఇన్‌చార్జి ఫైర్ అధికారి జావిద్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు ఆర్పివేశారు. దుకాణంలోని బట్టలు, ఫర్నిచర్‌తో పాటు విద్యుత్ పరికరాలు, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయని, దాదాపు రూ. 10లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు. సమాచారం అందిన వెంటనే ఎస్సై రాహుల్ సిబ్బందితో చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పులి పాదముద్రలపై పుకార్లు


రాములుగూడ శివారులో అటవీశాఖ అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జంబుల్‌ధరి, రాములుగూడ శివారు ప్రాంతాల్లో పులి అడుగులు కన్పించాయంటూ వదంతులు వ్యాప్తి చెందాయి. కొంత మంది రైతులు సోమవారం వ్యవసాయ పొలాలకు వెళ్లగా హైనా అడుగులు చూసి పులి అడుగులుగా భావించి భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారం తెలుసుకున్న బీట్ అధికారి ప్రీతం సిబ్బంది, రైతులతో కలిసి వ్యవసాయ పొలాల్లో పర్యటించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఆయన వాటిని హైనా అడుగులుగా గుర్తించారు. ఆయన మాట్లాడుతూ మండల శివారు ప్రాంతాల్లో పులి సంచారం లేదని, ఎవరూ పుకార్లు నమ్మవద్దన్నారు. పుకార్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్లంపల్లి ఏరియాలో 135 శాతం బొగ్గు ఉత్పత్తి


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో గత నెలలో 135 శాతం బొగ్గును ఉత్పత్తి చేశామని ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో ఏరియాకు 2.50 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 3.39 లక్షల టన్నుల ఉత్పత్తిని చేపట్టి ఉత్పత్తిలో 135 శాతం నమోదు చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో అధిక వర్షాల కారణంగా కోల్పోయిన ఉత్పత్తిని ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న కాలంలో సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అక్టోబర్‌లో వర్షాలు లేకపోవడంతో 135 శాతం ఉత్పత్తిని సాధించగలిగామన్నారు. ఇదే తరహాలో ఉత్పత్తి ప్రక్రియ కొనసాగించి ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని సాధిస్తామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 21.80 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 19.78 లక్షల టన్నులను ఉత్పత్తి చేసి 91శాతంలో బెల్లంపల్లి ఏరియా ముందుకు సాగుతోందన్నారు. త్వరలో కంపెనీ లెవల్ క్రికెట్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

బాలికను వేధించిన వ్యక్తి అరెస్ట్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మున్సిపాలిటీ కాల్‌టెక్స్‌కు చెందిన పదమూడేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించి వేధింపులకు గురి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ ఎస్సై మహేందర్ తెలిపారు. కాల్‌టెక్స్‌కు చెందిన బాలిక స్కూల్‌కు వెళ్లే క్రమంలో సుబ్బారావు పల్లెకు చెందిన రాస వెంకటేశ్ అనే వ్యక్తి ప్రేమించానని వెంటపడి మూడు రోజుల క్రితం బాలిక చేయి పట్టుకొని తన బైక్‌పై ఎక్కాలని బలవంతం చేశాడు. ఈ విషయాన్ని ఇంట్లో చెబితే చంపుతామని బెదిరించాడు. బాలిక జరిగిన విషయాన్ని తల్లికి తెలుపడంతో తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సోమవారం వెంకటేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: సెల్‌ఫోన్ చోరీకి పాల్పడిన మహారాష్ట్రకు చెందిన నూర్‌సింగ్ రాథోడ్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల 29న అంబేద్కర్ చౌక్‌లో చాయ్ తాగుతున్న వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ దొంగిలించి నూర్‌సింగ్ ఇతరులకు విక్రయించాడు. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. సెల్‌ఫోన్‌ను రికవరీ చేశామన్నారు.

పంట చేనులో గంజాయి సాగు

- రూ.70 లక్షల విలువైన మొక్కలు స్వాధీనం
- నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల


గంజాయి మొక్కలు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, ఇన్‌చార్జి డీఎస్పీ ప్రభాకర్

నిర్మల్‌టౌన్: వ్యవసాయ భూమిలో గంజాయి సాగుచేస్తున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కడెం మండలం మంగల్‌సింగ్ తండాకు చెందిన టకాడ ఇందల్, కసావత్ సజన్ లాల్, గోతి రవీందర్, కచ్‌కాద్ సంతోష్, భామనే సురేందర్, పేలియ ప్రతాప్ సింగ్ అల్లంపల్లి పరిసర ప్రాంతాల్లోని బాబానాయక్ తండా గ్రామ శివారులో గంజాయి సాగు చేస్తున్నారు. టకాడ ఇందల్ తండ్రి హరిచంద్ పేరు మీద ఉన్న ఐదున్నర ఎకరాల భూమిలో పత్తి, తొగరు పంటతోపాటు గంజాయి సాగు చేస్తుండగా, పక్కా సమాచారం మేరకు ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బృందం సోమవారం తెల్లవారుజామున దాడి చేశారు. ఇందల్ పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. 83 గంజాయి మొక్కలు గుర్తించి వాటిని తూకం వేయగా 46.64 కిలోలుగా తేలాయి. వాటి విలువ రూ.41,50,000గా అంచనా వేశారు. ఇందల్‌ను విచారించగా గ్రామంలో మరో ఐదుగురు గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిపాడు. కసావత్ సజన్‌లాల్ వ్యవసాయ భూమిలో రూ.లక్ష విలువైన 400 గ్రాముల గంజాయి మొక్కలు, గోతి రవీందర్ చేనులో రూ.4 లక్షల విలువైన 2.53 కిలోల 8 గంజాయి మొక్కలు, కచ్‌కాద్ సంతోష్ చేనులో రూ.8 లక్షల విలువైన 3.49 కిలోల 16 గంజాయి మొక్కలు, భామనే సురేందర్ చేనులో రూ.8 లక్షల విలువైన 3.29 కిలోల 16 మొక్కలు, ప్రతాప్ సింగ్ చేనులో రూ.10 లక్షల విలువైన 4.08 కిలోల 20 గంజాయి మొక్కలను గుర్తించినట్లు తెలిపారు. వీటిన్నంటి విలువ రూ.70 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు, పోలీసులు సమష్టిగా కృషి చేసి నిర్మల్ జిల్లా నుంచి గంజాయి మహమ్మారిని తరిమికొడదామని పిలుపునిచ్చారు.

862 కిలోల గంజాయి ధ్వంసం..
ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాలో ఇదివరకు నమోదైన 14 కేసుల్లో పట్టుబడిన 862 కిలోల గంజాయిని సోమవారం నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద గల మెడికేర్ సర్వీస్ సెంటర్‌లో ధ్వంసం చేశారు. ప్రక్రియను పరిశీలించేందుకు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, కమిటీ సభ్యులు, డీసీఆర్‌బీ డీఎస్పీ సురేందర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, డీసీఆర్‌బీ ఎస్సై హకీమ్‌లు వెళ్లారు. వారి సమక్షంలోనే ధ్వంసం చేశారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ, పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్, స్టేడియం సమీపంలో గల హోటళ్లు, పాన్‌షాపుల్లో నార్కొటిక్ స్నైపర్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలతో అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయన్నారు. ఎక్కడైన గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సీఐ వెంట ఎస్సై అశోక్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

గంజాయి మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా 87126 59555, 87126 59599లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇన్‌చార్జి డీఎస్పీ ప్రభాకర్, ఖానాపూర్ సీఐ సైదారావు, కడెం ఎస్సై కృష్ణ సాగర్, డాగ్‌స్క్వాడ్ సాయి, సీసీఎస్ సిబ్బంది తిరుపతి, గణేశ్, సతీశ్‌ను అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి గ్రామసమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా బోలెరో మాక్స్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 9 పశువులను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడిన వాంకిడి మండలంలోని గోయగాం గ్రామానికి చెందిన సద్దాం సర్ఫుద్దీన్ అనే డ్రైవర్‌తోపాటు మహారాష్ట్రకు చెందిన బోడ మంగేశ్ నరసింహ, వ్యాన్ ఓనర్ అజీమ్ షాదుల్‌షేక్, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రియాజ్ ఖురేషిలను పట్టుకుని కాగజ్‌నగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఎస్సై వెంకటేశ్, సిబ్బంది రమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. గాదిగూడ మండలానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామానికి అంగన్వాడీ సెంటర్, సీసీ రోడ్డు మంజూరు చేయించాలని, బేల మండలం బోరిగాం గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, నార్నూర్ మండలం తడిహత్నూర్ గ్రామానికి చెందిన పురుషోత్తం తనకు ఫొటోగ్రఫీ ఉద్యోగం కల్పించాలని, ఇంద్రవెల్లి మండలానికి చెందిన బాలు తనకు బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

50 ఎల్‌టీఆర్ కేసులు పరిష్కారం..
గత మూడు నెలల్లో సెప్టెంబర్ 1 నుంచి ఉట్నూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో మొత్తం 50 ఎల్‌టీఆర్ కేసులు పరిష్కరించినట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైనూర్, జైనథ్, తిర్యాణి, మందమర్రి మండలాలలోని గిరిజన రైతులకు 30 ఎకరాల భూమిని స్వాధీనం చేశామన్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, బేల, ఆదిలాబాద్, కెరమెరి, దండెపల్లి మండలాల్లోని 50 ఎకరాల భూమి ప్రభుత్వానికి స్వాధీనం చేశామన్నారు.